అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం 11 జులై 2023

సర్వం.. ప్లాస్టిక్ మయం

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ గ్రామంలో సోమవారం వారాంతపు సంత కావడంతో నిజామాబాద్ నుండి కూరగాయలు ప్లాస్టిక్ సంచుల్లో తీసుకువచ్చారు. అధికారులు ప్లాస్టిక్‌పై నిషేధం విధించినప్పటికీ చర్యలు శూన్యం. దీంతో వ్యాపారులు ప్లాస్టిక్ వాడకం యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.


కూరగాయలు ప్లాస్టిక్ కవర్‌లలో తరలింపు

పాముకాటుతో రైతు మృతి

నవతెలంగాణ-భిక్కనూర్


పంచనామా చేస్తున్న పోలీసులు

పాముకాటుతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని అంతంపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శంకర్ (59) ఆదివారం మధ్యాహ్నం తన వ్యవసాయ భావి వద్దకు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. అర్ధరాత్రి సమయంలో నోట్లో నుండి నురుగు రావడంతో గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళుతున్న సమయంలో మార్గమధ్యలో మరణించాడు. కుటుంబీకుల ఫిర్యాదుతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు.

గ్రామ సీమలను ప్రతి ఉదయం అద్దంలా మెరిపిస్తున్న పంచాయతీ కార్మికుల జీవితాల్లో మాత్రం చీకటి అలుముకుంటోంది. కనీస వేతనాలు అమలు చేయాలని, కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని, మల్టిపర్పస్ పని విధానం రద్దు చేయాలని యేండ్లుగా వేడుకుంటున్నా పాలకపక్షాలు పట్టించుకోవడం లేదు. కార్యదర్శికి కోపం వచ్చినా, సర్పంచ్ కన్నెర్ర చేసినా పంచాయతీ కార్మికులే సమిధలవుతున్నారు. మల్టిపర్పస్ విధానం పేర హోదాతో సంబంధం లేకుండా అన్ని పనులు చేయాల్సి వస్తోంది. కారోబార్లు, బిల్లు కలెక్టర్లు కూడా ట్రాక్టర్ స్టీరింగ్ పట్టుకుంటున్నారు. ఇక పారిశుద్ధ్య పనుల్లో ప్రాణాలు పోతే ఆ కుటుంబాలు రోడ్డునపడాల్సిన పరిస్థితి. ప్రమాద బీమా కూడా అందడం లేదు. ఈ సమస్యలన్నింటిని ఇప్పటికే పలుమార్లు సర్కారుకు విన్నవించినా... చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది. దీంతో చేసేది లేక కార్మికులు సమ్మె బాట పట్టారు. సమస్యలు పరిష్కరించే వరకు తట్టబుట్ట పట్టబోమని స్పష్టం చేశారు. గత ఐదు రోజులుగా సమ్మెలో పాల్గొంటున్నారు. సర్కారు స్పందించకపోవడంతో పల్లెసీమలు దుర్గంధంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సర్కారు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

-నవతెలంగాణ, నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సమ్మెపై సర్కారు మౌనం

- 5వ రోజుకు పంచాయతీ కార్మికుల సమ్మె
- కనీస వేతనాలు, క్రమబద్ధీకరణకు వేడుకోలు
- పలుమార్లు విన్నపాలు, నిరసనలు
- సర్కారు పట్టించుకోకపోవడంతో సమ్మె బాట
- పల్లెల్లో పేరుకుపోతున్న చెత్త
- సర్కారు స్పందించాలని కార్మిక సంఘాల డిమాండ్

గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, కార్మికులకు జీఓ నెం. 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం అందించాలని, పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జులై 6వ తేదీ నుంచి కార్మికులు సమ్మెబాట పట్టారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారు. ఒక్క నిజామాబాద్ జిల్లాలోనే 2480 మంది పని చేస్తున్నారు. వీరిలో పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్స్ వివిధ కేటగిరిలలో పని చేస్తున్నారు. చెత్తా చెదారం, మానవుల, జంతు వులు మళం, కుళ్ళిపోయిన శవాల తొలగింపు, మురికి కాలువలను శుభ్రం చేస్తూ నిత్యం మలినాలతో సహజీవనం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.51 తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్



నవీపేట్‌లో ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారం

విధానాన్ని ప్రవేశ పెట్టింది. వివిధ రకాల కేటగిరీలను రద్దు చేయడంతో కలం పట్టిన కారోబార్, బిల్ కలెక్టలు స్టీరింగ్ పడుతున్నారు. సిబ్బందితో నైపుణ్యం లేని పనులు చేయించ డంతో అనేక ప్రమాదాలు జరుగుతు న్నాయి. గ్రామ పంచాయతీలకు కొత్తగా ట్రాక్టర్లు కేటాయించిన తర్వాత పంచాయతీ కార్మికుల తోనే డ్రైవింగ్ చేయిస్తున్నారు. కొన్ని పంచాయతీల్లో ఉన్న డ్రైవర్లను తొలగించి కారోబార్, బిల్ కలెక్టర్లతో ట్రాక్టర్లు నడిపిస్తు న్నారు. దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదం జరిగినా కార్మికునికి సర్కారు నుంచి పైసా సాయం అందడం లేదు. కేంద్ర సర్కారు సైతం ఇదే విధంగా వ్యవహరిస్తోంది. ఎనిమిది నెలలుగా కేంద్రం నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో కార్మికులకు వేతనాలు సైతం సమయానికి అందడం లేదు. వేతనాలు చెల్లించాలని అని కోరితే ఫండ్స్ లేవని చేతులెత్తేస్తున్నారు. ఇక కార్మికులకు పూర్తిస్థాయిలో వేతనాలు అమలు కావడం లేదు. సర్కారు ప్రతి కార్మికునికి రూ.9500 చెల్లించాలని ప్రకటించినప్పటికీ.. ఎక్కడా అమలు జరగడం లేదు. పైగా కొన్ని పంచాయతీల్లో ఈ వేతనాన్ని ఇద్దరు నుంచి ముగ్గురు కార్మికులకు విభజించి వేతనంగా ఇస్తున్నారు. కార్మికుల అమాయకత్వాన్ని సొమ్ము చేసుకుంటు న్నారు. పెరిగిన వేతనం అడిగితే తెల్లారి నుంచి పనికి రావొద్దని బెదిరిస్తున్నారు. దీంతో కార్మికులకు ఏ ధీమా లేకపోవడంతో ఎంత ఇస్తే అంతే వేతనంగా తీసుకుంటున్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



జంగం గంగాధర్.
గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక జేఏసీ ఉమ్మడి జిల్లా కన్వీనర్

గ్రామ పంచాయతీ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలి. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి. పి.ఆర్.సి.లో నిర్ణయించిన కనీస వేతనం రూ.19,000గా నిర్ణయించాలి. ఆ లోపు జీవో నెం.60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500 నిర్ణయించాలి. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించాలి. జీవో నెం.51 ని సవరించాలి. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి. ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుం బానికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలి.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే

ఉద్యమాలు ఉధృతం చేస్తాం

- సీఐటీయూ నాయకుల హెచ్చరిక
- కనీస వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ, ధర్నా


కలెక్టరేట్ ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అంగన్వాడీ టీచర్‌లను, ఆయాలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని, పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ స్కీమును ప్రకటించి ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీలు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు నల్ల చీరలు ధరించి స్థానిక రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి బస్టాండ్, భగత్ సింగ్ చౌరస్తా, రైల్వే ఓవర్ బ్రిడ్జి, మార్కెట్ యార్డ్, దుబ్బ చౌరస్తా మీదుగా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ర్యాలీ పొడగునా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు నూర్జహాన్, ఏ రమేష్ బాబు మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలను పరిష్కరిం చాలని అనేకమార్లు అధికారులకు ప్రభుత్వానికి విన్నవించుకున్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిం చటంతో సోమవారం దేశవ్యాప్త డిమాండ్స్ డే నిర్వహించినట్టు తెలిపారు.

సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం గ్రాట్యూటీ పెన్షన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్‌కు అయిదు లక్షలు, ఆయాలకు మూడు లక్షలు ఇవ్వాలని చనిపోయిన అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు 50వేల రూపాయలు దహన సంస్కారాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. పది సంవత్సరాల నుండి బకాయి ఉన్న డిఏలను చెల్లించాలని, అధికారులు వేధింపులను మానుకోవాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని , ఇన్‌చార్జి అలవెన్స్‌ను సెంటర్ మెయింటెనెన్స్ అలవెన్సులను చెల్లించి ట్రాన్స్ఫర్ సదుపాయాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌లు, సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు దేవగంగు, ప్రధాన కార్యదర్శి స్వర్ణ, సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వై గంగాధర్, సిఐటియు నాయకులు కే రాములు, అంగన్వాడీ యూనియన్ నాయకులు చంద్రకళ, వాణి, సూర్య కళ, జ్యోతి, గోదావరి, యమునా, లక్ష్మి, తదితరులతోపాటు పెద్ద ఎత్తున అంగన్వాడీ టీచర్లు ఆయాలు పాల్గొన్నారు.


పత్తి పంటను కాపాడుకునేందుకు బిందెలతో నీళ్లు అందజేస్తున్న రైతు

ఎత్తిపోతున్న కాలం

- చినుకు పడక చిన్నబోతున్న రైతు
- పెద్దవానల జాడ లేక ఆగమవుతున్న అన్నదాతలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని పెద్దదేవ్‌సింగ్ తండాలో పది రోజుల కింద కురిసిన చిరుజల్లులకు రైతులు పత్తి విత్తనాలు నాటారు. విత్తనాలు నాటిన తరుణం నుండి వర్షాలు లేక మొలకలు ఎండిపోతున్నాయి. ఒక్క తండాలోనే కాగా జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాలు రాక రైతు చిన్నబోతున్నాడు. చెరువుల్లో చుక్క నీరు లేవు. బోర్లు ఎత్తిపోతున్నాయి. భూములు నెర్రలేస్తున్నాయి. కాలం గాక సాగు వెనకబడుతోంది.

వాన వస్తుందని ఆశతో విత్తనాలు వేసిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వానాకాలం మొదలై నెల రోజులు అవుతున్నా మండల, పరిసర ప్రాంతాల్లో చినుకు జాడలేదు. తొలకరి చినుకులు వచ్చినట్లే వచ్చి ముఖం చాటేయడంతో రైతులు ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. చినుకమ్మ కరుణించు అంటూ వేడుకుంటున్నారు. సాధారణంగా జూన్ మొదటి వారంలో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించి నెల రోజులు దాటింది. విస్తారంగా పడాల్సిన వర్షాలు పడక మొక్కలు ఎండిపోవడంతో తట్టుకోలేని రైతు కూలీలను పెట్టి మొక్కలకు బిందెల ద్వారా నీళ్లు పోస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కామారెడ్డి (తాడ్వాయి)


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ కాలనీలో నూతనంగా నిర్మాణం చేపట్టిన భవనంలోని లిఫ్ట్ నిర్మించే ప్రాంతంలో చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి కామారెడ్డి మండలం దేవునిపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి దత్తాద్రిగా గుర్తించారు. అనుమానాస్పద స్థితిలో దత్తాద్రి మృతించడంతో ఎవరైనా హత్య చేశారా లేక ఘర్షణ జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఘటన స్థలానికి సిఐ నరేష్ చేరుకొని పరిస్థితి సమీక్షించారు. మృతి చెందిన దత్తాద్రి కామారెడ్డిలో మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో

రాష్ట్ర ప్రభుత్వం విఫలం

12న విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయాలి
: వామపక్ష విద్యార్థి సంఘాలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎఫ్‌డీఎస్, ఎఐఎస్బి విద్యార్థి సంఘాల అధ్వర్యంలో సోమవారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కరించాలని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలని నిరసన చేశారు. రఘురాం మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులు సంక్షేమ హాస్టల్లో చదువుతున్నటువంటి విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని అదేవిధంగా పెండింగ్లో ఉన్నటువంటి మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12న జరిగే విద్యాసంస్థల బంద్ ను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు గోపాల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు విఘ్నేష్, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, పిడిఎస్యు జన్నారపు రాజేశ్వర్, పిడిఎస్యు ఉమ్మడి జిల్లా కార్యదర్శి రవీందర్, ఏఐఎస్బి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజావాణి వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

నవతెలంగాణ-కామారెడ్డి (తాడ్వాయి)

ప్రజావాణిలో వచ్చిన వినతులు, ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఆర్డిఓ సాయన్న లతో కలిసి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వస్తున్న ప్రజల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్య మివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తూ లిఖిత పూర్వక వివరణ అందజేయాలని అన్నారు. మొత్తం 53 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో సిపిఓ రాజారాం , జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్ అధికారులు పాల్గొన్నారు.

చంపి పాతేస్తం.. అడిగే దిక్కూ ఉండదు

- విలేకరులపై ఇసుక మాఫియా దాడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-కోటగిరి

'మీ సంగతి చూస్తాం రా. మిమ్మల్ని చంపేస్తే మీ అడ్రస్ కూడా తెల్వనీయం. మీరు పోతంగల్‌కు రారా.. అక్కడే చంపి పాతేస్తాము. అడిగే దిక్కు కూడా ఉండదు' అంటూ విలేకరులపై ఇసుక మాఫియా దాడి చేసింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా కోటగిరిలో సోమవారం చోటుచేసుకుంది. దాడి చేసిన ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రెస్‌క్లబ్, టీడబ్ల్యూజేఎఫ్ అధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. కోటగిరి ఉమ్మడి మండలంలోని పోతంగల్ మండల పరిధిలోగల పలు గ్రామాల నుంచి నిత్యం ఇసుక అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ఇసుక మాఫియా లక్షలు గడిస్తున్నారు. నూతనంగా మండలం ఏర్పాటు కావడం అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వేబిల్లులు లేకున్నా యథేచ్ఛగా ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. సోమవారం కోటగిరి గ్రామంలో ఇసుక పర్మిషన్ లేకుండా ఇసుక తరలింపు పై విలేకరులు అడగడంతో సమాధానం దాటవేయడంతో కృష్ణకుమార్(వెలుగు), శ్రీకాంత్(దిశ) విలేకరులపై దాడి చేశారు. పైగా చంపేసి పాతేస్తామని బెదిరించారు. ఎవరికి ఫిర్యాదు చేసుకుంటావో చేసుకో అంటూ దుర్భాషలాడారు. దాడి ఘటన పట్ల స్థానిక విలేకరులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇసుక తరలింపుపై ఉన్నతాధికారులకు, పాలకుల దృష్టికి తీసుకెళ్తామని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

మధ్యాహ్న భోజన కార్మికుల

పొట్టగొట్టే చర్యలను వీడాలి

- పెండింగ్ బిల్లులు చెల్లించి, కొత్త మెనూకు చార్జీలు పెంచాలి
- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో టోకెన్ సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

'మధ్యాహ్న భోజన నిర్వహణకు పెరుగుతున్న ధరలకనుగుణంగా బడ్జెట్ కేటాయింపులే తక్కువ. అవి కూడా నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో కార్మికులు అప్పులు చేసి వంట చేయడంతో అప్పులపాలై తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని' తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నగరంలోని శంకర్ భవన్ పాఠశాలలో గల ఎంఈఓ కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్త టోకెన్ సమ్మె ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022 మార్చిలో అసెంబ్లీలో వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించినప్పటి నుండి ఎరియర్స్‌తో సహా బకాయిలు చెల్లించాలని, కొత్త మెనూకు బడ్జెట్ పెంచాలని, పెండింగ్ బిల్లులు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 8 కోట్ల పెండింగ్ బిల్లులు ఉన్నాయని, రెండు కోట్ల రూపాయలు విడుదల చేశామని చెప్పున్నప్పటికీ ఇంకా కార్మికుల ఖాతాల్లోకి చేరలేదని తెలిపారు. 9, 10 తరగతి లకు ఐదు నెలల గుడ్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, బిల్లులు రాక పోయినా కోడి గుడ్లు పెట్టాలని, నూతన మెనూ అమలు చేయాలని స్కూల్లో హెడ్మాస్టర్లు మధ్యాహ్న భోజన నిర్వాహకులపై ఒత్తిడి తీసుకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వేధింపులను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కటారి రాములు, కళావతి, మధ్యాహ్న భోజన పథకం నాయకులు సురేందర్ రెడ్డి, పర్వవ్వ, శేఖర్, హరి శంకర్, నాగలక్ష్మి, సుమలత, భూలక్ష్మి, మహమూధ పాల్గొన్నారు.




ఎంఈవో కార్యాలయం ఎదుట బైటాయించిన కార్మికులు, నాయకులు

రైతు ఆత్మహత్య

- ఒక దిక్కు అప్పులు, మరో దిక్కు అనారోగ్యం

నవతెలంగాణ-రామారెడ్డి



అప్పులు తీర్చలేక, మరోవైపు ఆరోగ్యం సహకరించకపోవడంతో తీవ్ర మనస్తాపంతో ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పురిమి శెట్టి లక్ష్మీనారాయణ(57) అప్పు చేసి కొత్తగా ఇల్లు నిర్మించుకున్నాడు. కామారెడ్డి లో పనికి వెళ్లిన చోట కాలుకు గాయం అవడంతో, ఆసుపత్రిలో చూయించిన నయం కాకపోవడంతో, అనారోగ్యం, అప్పుల బాధతో తీవ్ర కలత చెందేవాడు. ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య అంజమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నవతెలంగాణ

నిజామాబాద్

2

మంగళవారం 11 జులై 2023

లక్ష రూపాయల ఎల్వోసి అందజేసిన మంత్రి

నవతెలంగాణ - వేల్పూర్



మండలంలోని పచ్చలనడ్కుడకు చెందిన మహిళకు హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్సకోసం లక్ష రూపాయల ఎల్వోసి మంజూరు చేయించి మంత్రి ప్రశాంత్‌రెడ్డి సోమవారం అందజేశారు. మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన జి.రూప కడుపునొప్పి సంబంధిత అనారోగ్యంతో బాధ పడుతున్న విషయం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటామని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

కంపోస్ట్ ఎరువు విక్రయం

నవతెలంగాణ-ఏర్గట్ల



మండలంలోని నాగేంద్రనగర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పల్లె ప్రగతిలో భాగంగా నిర్మించిన కంపోస్ట్ షెడ్‌లో తడి, చెత్త పొడి చెత్త వల్ల తయారైన ఎరువులను ఆర్గానిక్ కూరగాయల పంటల కోసం విక్రయించామని సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్ తెలిపారు. కంపోస్ట్ ఎరువును అమ్మడం ద్వారా 2022-23 సంవత్సరానికి గాను 10 వేల రూపాయలు గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సంధ్యారాణి, కారొబార్ జనార్ధన్ పాల్గొన్నారు.

నెలన్నరకే రోడ్డుకు కోత

- నాసిరకం పనులే కారణం : స్థానికులు

నవతెలంగాణ-మోర్తాడ్

ఇటీవల నూతనంగా నిర్మించిన రహదారి స్వల్ప వర్షాలకే కోతలకు గురి కావడం నాణ్యత లోపం కనిపిస్తుంది. జాతీయ రహదారి 63 నుండి 44 కలిపే లింకు రోడ్డు ఇటీవల నాలుగు కోట్ల రూపాయలతో తారు రోడ్డు మరమ్మతులు పనులు చేశారు. మండలంలోని ధర్మోర, శెట్‌పల్లి గ్రామాల మధ్యలో వాగు వంతెనపై 50లక్షల రూపాయలతో వంతెన నిర్మాణం నెలన్నర క్రితం పూర్తి చేశారు. వంతెనకు ఇరువైపులా రహదారికి మొరం పనులు నాణ్యత లేకుండా ఉండడంతో స్వల్ప వర్షాలకే రహదారికి రెండువైపులా భారీ పగుళ్లు ఏర్పడుతున్నాయి. రోడ్డు కోతకు గురి అయింది. వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయిలో మొరం మట్టితో లెవెల్ చేయాల్సి ఉన్నప్పటికీ నాణ్యత లేకుండా నామమాత్రంగా మట్టి పోసి బీటి రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. 50 లక్షల రూపాయలతో నిర్మించిన వంతెన రెండు వైపులా నాసిరకంతో పనులు చేపట్టడంతో ఆ గ్రామాల గుండా వెళ్లే ప్రజలకు ఇబ్బందులకు గురివుతున్నారు. భారీ వర్షాలు పడితే వంతెనకు ఇరువైపులా పూర్తిస్థాయిలో కోతలకు గురై ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.



కోతకు గురైన రోడ్డు

మా భూములే తీసుకుని

టోల్ వసూలు చేస్తారా..?

- టోల్‌ప్లాజా వద్ద గ్రామస్తుల ఆందోళన ముట్టడి, ధర్నా
- ఫ్రీపాసులు ఇవ్వాలని డిమాండ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జాతీయ రహదారి విస్తరిస్తున్న సమయంలో చాలా విలువైన భూములను అందజేసిన తమవద్ద నుండే రాకపోకలు సాగించే సమయంలో టోల్ ప్లాజా వద్ద డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని, వెంటనే సమీప గ్రామాలకు చెందిన వాహనదారులకు ఫ్రీ పాసులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామస్తులు టోల్ ప్లాజాను ముట్టడించి గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిటిసి మారంపల్లి సుధాకర్, మాజీ సర్పంచ్ పాశం కుమార్, సహకర సొసైటి చైర్మన్ చింతల పల్లి గోవర్ధన్ రెడ్డి, సహకార సొసైటీ మాజీ చైర్మన్ పాశం నర్సింలు,ఇందల్ వాయి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుమ్మరి మోహన్ లు మాట్లాడుతూ .. టోల్ ప్లాజా నిర్మించినప్పుడు సమీప గ్రామస్తులకు ఫ్రీ పాసులు ఇస్తారని అనుకున్నామని, కానీ డబ్బులు చెల్లించే విధంగా ఆదేశాలు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని అన్నారు. వ్యవసాయ సీజన్లో ఇందల్వాయి, గన్నారం, చంద్రయాన్‌పల్లి గ్రామాల రైతులు ఎరువులు, ఇతరత్రా సామాగ్రి కోసం రాకపోకలు సాగించే సమయంలో పాసులు లేక టోల్ ప్లాజా సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఇకనుండి తాము రూపాయి కూడా చెల్లించమని, ఫ్రీ పాసులు ఇవ్వాల్సిందేనని వారు డిమాండ్ చేశారు. టోల్ ప్లాజా మేనేజర్ వీరబాబు కు వినతి పత్రాన్ని అందజేసే అందజేశారు కార్యక్రమంలో మోచ్చ గోపాల్, ముత్తన్న, జెగ్గ గంగాదాస్, మురళి, శ్రీనివాస్, యామాద్రి గంగాధర్, మెందే రవి, నాగబోయి గంగాధర్,సిర్నాపల్లి గంగారం, నిజాం, మంగలి శ్రీనివాస్, గంగారం, సంఘం భూమయ్య రావోజి బాలగంగారం పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

- తండ్రి జ్ఞాపకార్థం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

తండ్రి జ్ఞాపకార్థం ఇందల్ వాయి మండలంలోని గన్నారం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులను సోమవారం పంపిణి చేశారు. తిరునగిరి వెంకట నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారుడు తిరున గిరి సప్తగిరి, కోడలు తిరున గిరి స్వాతి, కూతురు మధురకవి కవిత, వాసిని, మనస్విని లు మనుమరాళ్ళతో కలిసి ఒకటి నుండి 5 తరగతుల విద్యార్థులకు 114 బ్యాగులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమనికి ముఖ్య అతిథిగా సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రుల జ్ఞాపకాలు నేమరేసుకుని విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేయడం అభినందనీయ మన్నారు. కార్యక్రమంలో గన్నారం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు వీరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు ఎం. రవిందర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సమ్మెను విచ్ఛిన్నం చేసే కుట్రలను తిప్పి కొట్టాలి

- జంగం గంగాధర్
- 5వ రోజుకు జిపి కార్మికుల సమ్మె



నవీపేట్ : మాట్లాడుతున్న జంగం గంగాధర్

నవతెలంగాణ-నవీపేట్/సిరికొండ/జక్రాన్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెను విచ్చిన్నం చేసే కుట్రలను తిప్పి కొట్టాలని జేఏసీ జిల్లా కన్వీనర్ జంగం గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలో కార్మికులు చేపట్టిన 5వ రోజు సమ్మెకు మద్దతుగా ఆయన పాల్గొని మాట్లాడారు. డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి సిబ్బందికి భయభ్రాంతులకు గురిచేసి సమ్మెను విచ్చినం చేసే కుట్రలను పన్నుతున్నారని అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమ్మె డిమాండ్లను నెరవేర్చుకోవాలని కోరారు. సమ్మెకు ఏఐకేఎస్ నాయకులు దేవేందర్ సింగ్ మద్దతు పలికారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు నాయక్ వాడి శ్రీనివాస్ మేకల అంజన్న గంగాధర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



సిరికొండలో సమ్మెలో కూర్చున్న జీపీ కార్మికులు

సిరికొండ:తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో సిరికొండ ఎంపీడీవో కార్యాలయం ముందు నిరవధిక సమ్మె కొనసాగుతున్నది.. సమ్మెను ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ, జేఏసీ రాష్ట్ర నాయకులు ఎండి కాజా మోహినుద్దీన్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వి బాలయ్య , ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ సెక్రెటరీ పి.కారల్ మర్క్స మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12,769 గ్రామపంచాయతీల్లో 50 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరందరినీ పర్మినెంట్ చేయాలని 19వేల రూపాయల వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని సహజ మరణం చెందిన షో 30 వేల రూపాయల అంత్యక్రియల ఖర్చులకు ఇవ్వాలని 10 లక్షల ప్రమాద బీమా పథకం ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పి.కారల్ మర్క్స , మండల నాయకులు బకారం చిన్న గంగారం, పి వై ఎల్ మండల అధ్యక్షులు బి. సాయిలు, మల్కి సంజీవ్, నాయకులు గంగన్న, కార్మికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద జిపి కార్మికుల ప్రదర్శన



జక్రాన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

జక్రాన్‌పల్లి :గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె 5వ రోజు సందర్భంగా జక్రాన్‌పల్లి ఎంపీడీవో ఆఫీస్ నుండి ఊరేగింపుగా వెళ్లి (నిజామాబాద్ జిల్లా) అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శన నిర్వహించారు. జీపీ ఉద్యోగ కార్మికుల వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతి వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు పాల్గొని మాట్లాడారు. జీవో 60 ప్రకారం సఫాయి కార్మికులకు 15,600, కారోబార్, బిల్ కలెక్టర్, ట్రాక్టర్ డ్రైవర్ వాళ్లకు 19,500 వేతనం ఇవ్వాలని పేర్కొన్న ఇప్పటివరకు అమలు చేయలేదని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఉన్న 50వేల ఉద్యోగ కార్మికులకు వెంటనే పీఎఫ్ ఈఎస్ఐ చట్టాలను అమలు చేయాలని, ప్రమాద బీమా 10 లక్షలు సాధారణ బీమా ఐదు లక్షలు పోస్టాఫీస్‌లో ప్రభుత్వం కట్టాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జక్రాన్‌పల్లి జేఏసీ అధ్యక్షులు సవిన్, ఉపాధ్యక్షులు సంతోష్, కార్యదర్శి భానుచందర్, సహాయ కార్యదర్శి సొప్పరి గంగాధర్, గోపి, మోహన్, యూసుఫ్, శ్రీనివాస్ రెడ్డి, సర్పర్ లక్ష్మి, భోజమ్మ, నాగమణి, గున్నవ్వ, కోలిప్యాక్ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నవతెలంగాణ-సిరికొండ

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం సమ్మెను ప్రారంభించారు. ఏఐటీయూసీ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్లో ఉన్న తొమ్మిది నెలల బకాయి బిల్లులు, కేసీఆర్ పెంచిన 18 నెలల వేతనాలు చెల్లించాలని ,మధ్యాహ్న భోజన కార్మికులకు కోడిగుడ్లను, వంట సామాగ్రిని, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని ,పిఎఫ్, ఈఎస్ఐ ,ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఆందోళన నిర్వహిస్తున్న సమస్యను పరిష్కరించకపోగా కొత్త మెనూ పేరుతో కార్మికులపై మోయలేని భారాన్ని మోపుతున్నారని అన్నారు. తొమ్మిది నెలల బకాయి బిల్లులు రాకపోవడంతో కార్మికులు అప్పుల పాలయ్యారని, ఆస్తులు అమ్ముకుంటున్నారు అని తెలిపారు. ప్రైవేటు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించే ప్రభుత్వం పాఠశాలల్లో పేద విద్యార్థులకు భోజనం పెడుతున్న కార్మికుల బిల్లును చెల్లించకపోవడం దుర్మార్గమని అన్నారు. బిల్లులు చెల్లించడంతోపాటు, బకాయి వేతనాలు ఇతర సమస్యలను పరిష్కరించాలని, అప్పటివరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు చక్రపాణి, బుచ్చవ్వ, రాజనర్సు, లక్ష్మణ్, ప్రమీల, రాజమణి, పద్మ పిన్నెల హనుమాన్లు, కండ్లకోయ గంగాధర్, అలీ ఇమ్రాన్, సాయమ్మ , లావణ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఫొటో

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

- ఉర్దూ పాఠశాలను సందర్శించిన డీఈవో దుర్గా ప్రసాద్



మాట్లాడుతున్న డీఈవో

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉర్దూ మీడియంను సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి దుర్గా ప్రసాద్ ఆకస్మికంగా సోమవారం సందర్శించారు. గత నెలలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో పదోతరగతి ఫలితాల్లో మొత్తం 29 మంది విద్యార్థులకు గాను 9మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించారని నవతెలంగాణ విలేకరి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆరోజు ఎంపీపీ గద్దె భూమన్న, ఇతర సర్పంచులు ఎంపిటిసిలు కలిసి ఉపాధ్యాయులను నియమించే విధంగా చూడాలని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానించి కలెక్టర్‌కు పంపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం చదువులు చేప్పే వారు లేకపోవడంతో, దాదాపు మొత్తం విద్యార్థులు గణితంలోనే ఫెయిల్ అయ్యారని, కొన్నేళ్ళుగా ఆ సబ్జెక్టుకు సంబంధించి బోధించేవారు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. దానిలో భాగంగా ప్రైమరీ స్కూల్ టీచర్ (సోషల్ సబ్జెక్టు కోసం)ను నియామకం చేసినట్లు విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ వివరించారు. గణితం టీచర్ తాత్కాలికంగా నియామకం చేశామని, వారానికి మూడు రోజులు ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో, మరో మూడు రోజులు పని చేసే చోట బోధన చేసే విధంగా డిప్యుటేషన్ వేయడం జరిగిందని, అధ్యాపకులు మంచి విద్యా బోధన చేయించే విధంగా చూడాలని విద్యా శాఖ అధికారి దుర్గా ప్రసాద్ వివరించారు. అయన వెంట మండల విద్యాశాఖ అధికారి రాజా గంగారాంతోపాటు అధ్యాపకులు, స్థానికులు ఉన్నారు.

గుండెపోటుతో సూపరింటెండెంట్ మృతి

- కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధుల సంతాపం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కంఠేశ్వర్

నిజాంబాద్‌లోని కలెక్టరేట్లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్ మెతుకు రమేష్ (42) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రెవెన్యూ శాఖలో టైపిస్టుగా చేరి ప్రస్తుతం తహసీల్దార్‌గా పని చేస్తున్న మెతుకు రమేష్ సీనియారిటీ పరంగా త్వరలో ఆర్డీవో గాకూడా పదోన్నతి పొందాల్సి ఉంది. నిజామాబాద్ నగరంలోని బైపాస్ రోడ్డులో అపార్ట్మెంట్లో ఉండేవాడు. సోమవారం తెల్లవారుజామున గుండెపోటు రాగా అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. సౌమ్యుడిగా వివాదరహితుడిగా ఉన్న మెతుకు రమేష్ గతంలో హైదరాబాదులో ఎన్ఫోర్స్మెంట్ విభాగంలో పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంజనీరింగ్ కళాశాలల తనిఖీలలో విధులు నిర్వహించారు. తదనంతరం నిజామాబాద్ జిల్లాలోని ధర్పల్లి, ఇందల్వాయి తహసీల్దారుగా పని చేశారు. ఇందల్వాయి తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో ఇసుక లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ యజమానికి చలాన్ వేయగా దానిని చెల్లించకుండా తనను తహసీల్దార్ లంచం డిమాండ్ చేశాడని ఫిర్యాదు చేయడంతో ఏసీబీ సోదాలను నిర్వహించింది. సోదాల్లో ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఈ క్రమంలోనే రమేష్‌ను ఇందల్వాయి నుంచి పోతంగల్‌కు బదిలీ చేశారు. ఇటీవల అక్కడి నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేయగా తాను తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఆ బెంగతోనే గుండెపోటు వచ్చి ఉంటుందని రెవిన్యూ అధికారులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. తహసీల్దార్ మెతుకు రమేష్ మరణం పట్ల జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నిజామాబాద్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమన రెడ్డి, ప్రశాంత్, తదితరులు సంతాపం తెలిపారు.



మెతుకు రమేష్ (ఫైల్)

డిచ్‌పల్లి: ఇందల్ వాయి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. అందరితో ప్రేమానురాగాలతో, పలకరించే రమేష్ మృతి చేందడం తమను తీవ్రంగా కలిచి వేసిందని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది తెలిపారు.ఇందల్ వాయి తహసిల్దార్ కార్యాలయంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఆర్మూర్ : జిల్లా కలెక్టరేట్లో సూపర్డెంట్‌గా విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ మెతుకు రమేష్ గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపిందని పట్టణ తహసీల్దార్ వేణు గోపాల్ గౌడ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఆలూరు తహసిల్దార్ దత్త్రాద్రి, టీఎన్జీవో నాయకులు షికారి శ్రీనివాస్, తార తదితరులు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు .

రివర్స్ పంపింగ్ ఇదివరకు ఎరుగలే

- ముప్కాల్ పంప్‌హౌజ్‌ను సందర్శించిన రైతులు
- స్వయంగా ఏర్పాట్లు చేసిన వేముల

నవతెలంగాణ-ముప్కాల్/కమ్మర్‌పల్లి

కాళేశ్వరం ప్రాజెక్ట్ 'ఎస్సారెస్పీ పునర్జీవనం పథకం' ముప్కాల్ పంప్ హౌజ్ సందర్శనలో భాగంగా సోమవారం కమ్మర్ పల్లి మండలం చౌట్పల్లి క్లస్టర్ గ్రామాల పరిధి నుంచి రైతులు, ప్రజలు ముప్కాల్ పంప్ హౌజ్ సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎవరికి ఇబ్బందులు తలెత్తకుండా స్వయంగా బస్సులను ఏర్పాటు చేయించారు. కాళేశ్వరం నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ లోకి రివర్స్ గా వచ్చి చేరుతున్న నీటిని చూసి మధురానుభూతిని పొందారు. ఇది ఎంతో అద్భుతమైన మరువలేని రోజని రైతులు సంబరపడ్డారు. రైతుల సౌకర్యార్థం భోజనాలను సైతం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, ఎంపీపీ సామ పద్మ- వెంకట్ రెడ్డి, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ- నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ప్రజప్రతినిధులు పాల్గొన్నారు.

కమ్మర్ పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామం నుండి ఎస్సారెస్పీ వద్ద కాలేశ్వరం జలాలను చూడటానికి పెద్ద ఎత్తున గ్రామ రైతులు, మహిళ రైతులు, గ్రామ అభివృద్ధి కమిటీ బృందం సభ్యులు తరలి వెళ్లారు. ముప్కల్ పంప్ హౌస్ వద్ద వరద కాలువ రివర్స్ పంపింగ్ ద్వారా విడుదలవుతున్న కాళేశ్వరం జలాలను సభ్యులు తిలకించారు. పంప్‌హౌస్ లోపల మోటార్లను, నీరు విడుదలవు తున్న తీరును పరిశీలించారు. అంతకుముందు బృందం సభ్యులు తరలిన బస్సును బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బద్దం చిన్నారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ పద్యం రాజేశ్వర్, గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బైకాన్ మహేష్, ఉప సర్పంచ్ విక్రమ్, బిఆర్ఎస్ సోషల్ మీడియా మండల కన్వీనర్ బొడ దేవేందర్, తోట అప్పయ్య మోహన్, బందేల రాజు, సక్కారం శ్రీనివాస్, గుండబోయిన రాజు, నెల్ల రమేష్, నల్ల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ముప్కాల్ : సందర్శనకు వచ్చిన రైతులు



కమ్మర్‌పల్లి: కాళేశ్వరం జలాలు చూసేందుకు వెళ్లిన రైతులు

19 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 19 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ తెలిపారు. పట్టుబడిన 38 మందిపై కేసు నమోదు చేసుకొని వారికి సోమవారం నగరంలోని జిల్లా టిటిఐ కౌన్సిలింగ్ సెంటర్లో మద్యం కౌన్సెలింగ్ నిర్వహించారు.

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- ఎంపీపీ కుంచాల విమల రాజు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకొని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని ఎంపీపీ కుంచాల విమల రాజు అన్నారు. సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో మండలంలోని సికింద్రాపూర్ గ్రామంలో మహిళా గ్రామ సమైక్య జనరల్ బాడీ సమావేశం అధ్యక్షురాలు శ్వేత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కుంచాల విమల రాజు హాజరై మాట్లాడుతూ బ్యాంకు రుణాలు, శ్రీనిధి రుణాలు గ్రామ సంఘం రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధిని సాధించాలని మహిళలను కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు వడ్డీ లేని రుణాల రాయితీ డబ్బులు సంఘం ఖాతాలలో జమ చేసిందని తెలిపారు. ప్రతి సంఘ సభ్యురాలు ఇన్సూరెన్స్ ను చేయించుకొని కుటుంబాలను కాపాడుకోవాలన్నారు. వడ్డీ రాయితీ ఉత్తర్వుల కాపీలను మహిళా సంఘాల లీడర్లకు అందజేశారు. అంతకుముందు గ్రామ సంఘానికి సంబంధించిన ఆర్థిక సంవత్సర జమ చెల్లింపులు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో మహిళా సంఘ సభ్యులకు బ్యాంకు ద్వారా ఐదు లక్షల రూపాయలు ఇచ్చేవారని ఇపుడు ఐదు లక్షల నుంచి పది లక్షలు 10 లక్షల నుంచి 15 లక్షలు 15 లక్షలు నుంచి 20 లక్షల వరకు రుణాలు అందించే అవకాశం ఉందని, వీటిని సంఘాల సభ్యులు వినియోగించి ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. అనంతరం గ్రామ మహిళా సమైక్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ కుంచాల విమల రాజు, స్థానిక గ్రామ సర్పంచ్ గంగామణి గంగాధర్, ఉప సర్పంచ్ గంగామణి సంతోష్, ఏపిఎం రవీందర్ రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న, వివో ఏ సుజాత, బుక్కీ పర్సు, గ్రామంలోని అన్ని మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు



వడ్డీలేని రుణాల రాయితీ ఉత్తర్వు కాపీలను అందజేస్తున ఎంపీపీ

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ గంపగోవర్దన్

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ గంపగోవర్దన్ అన్నారు. మండలంలోని అంబారిపేట గ్రామంలో నూతనంగా రూ.21లక్షలతో గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ పున్న రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, సీడీసీ చైర్మన్ నరసయ్య, ఎంపీపీ శారద, జడ్పిటిసి తిరుమల గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండ్ర మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ద రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి సోమవారం తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీలో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పదవ తరగతిలో 8.5 జీపీఏ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఈ నెల 12న స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. కళాశాలలో సీటు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- 5వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

జిల్లా వ్యాప్తంగా పలు మండల కేంద్రాల్లో గ్రామపంచాయతీ కార్మికుల చేపట్టిన సమ్మె 5వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమస్యలు పరిష్కరించాలని కార్మికులు డిమాండ్ చేశారు.

పిట్లం : మండల కేంద్ర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ మెన్‌లు, ఎలక్ట్రిసిటీ, కారోబార్, బిల్ కలెక్టర్‌లను పర్మినెంట్ చేయాలని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందినందరినీ పర్మినెంట్ చేయాలని జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి, ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని అన్నారు. పీఆర్‌సీలో నిర్ణయించిన మినిమం బేసిక్ రూ.19వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వీపర్లకు 15,600, పంపు ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు 19,500 నిర్ణయించాలన్నారు. ఆదాయమున్న పంచాయతీలలో వేతనాల పెంపునకు అనుమతించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా గ్రాట్యూటీ, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. 8 గంటల పనిదినాన్ని అమలు చేసి వారాంతపు సెలవులు, పండగ సెలవులు, జాతీయ ఆర్జిత సెలవు దినాలను అమలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 4 లేబర్ కోడ్‌లను రద్దుచేసి పంచాయతీ సిబ్బందికి కార్మిక చట్టాలు అమలు పరచాలని అన్నారు. సంవత్సరానికి మూడు జతల యూనిఫామ్, సరిపడా చెప్పులు, సబ్బులు, నూనెల బిల్లులకు గాను నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొండ సుభాష్, పత్తి బాలమని, నర్సమ్మ, పత్తి సుశీల, ఎన్.సాయిలు, ఆరేటి పోచయ్య, చెవుల శీను, అంకం శీను తదితరులు పాల్గొన్నారు.



రెంజల్ : నిరవధిక సమ్మెలో జీపీ కార్మికులు



సదాశివనగర్‌లో కొనసాగుతున్న సమ్మె..

ఎడపల్లి : మండల కేంద్రంలో తెలంగాణ జేఏసీ దీక్ష శిబిరంలో ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉద్యోగులు దీక్షలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు బి.మల్లేష్, జంగం గంగాధర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన లేదని అన్నారు. ఒకవైపు దేశంలో ఏ రాష్ట్రానికి రానటువంటి అవార్డులు మన తెలంగాణ రాష్ట్రానికి వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ-సీఐటీయూ వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయితీ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలి..

సదాశివనగర్ : మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో జీపీ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాల్ నర్స్ మాట్లాడుతూ.. ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ప్రతి ఆదివారం సెలవులు, జాతీయ పండుగ, పండుగ సెలవులు ఇవ్వాలని అన్నారు. జీతాలు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేష్, మండల అధ్యక్షుడు మామిండ్ల సాయిలు, మండల ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెంజల్ : పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె నాటికి 5వ రోజుకు చేరుకుంది. జేఏసీ జిల్లా అధ్యక్షులు జంగం గంగాధర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పారిశుద్ధ కార్మికుల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటూ కనీస వేతనాలు ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనియెడల ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వాటర్‌మెన్, ఎలక్ట్రిసిటీ కార్మికులను తమ పనులు యధావిధంగా కొనసాగించాలని చెప్పామని, తమ విధులు నిర్వర్తించిన తర్వాతే సమ్మెలో కొనసాగాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. పారిశుద్ధ్య పనులు మాత్రం నిలిపివేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఫాసియుద్దీన్, కార్యదర్శి బి.సాయిలు, నాగమణి, లచ్చవ్వ సాయమ్మ, లాలు, లచ్చిరాం, పోతయ్య పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా హనుమంత్ రెడ్డి ?

నవతెలంగాణ-భిక్కనూర్



భిక్కనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్లూరి హనుమంత్ రెడ్డి నియమితులైనట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఇంతకుముందు చైర్మన్‌గా కొనసాగిన భగవంతరెడ్డి ఇటీవల మరణించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న హనుమంత్‌రెడ్డిని నియమించినట్లు, ఈ మేరకు వ్యవసాయ శాఖ నుంచి ఉత్తర్వులు రానున్నాయని హనుమంతరెడ్డి పేరును ఎమ్మెల్యే గోవర్ధన్ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్యే ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకొని ఆయనను చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. చైర్మన్‌గా నియమితులవుతున్న సందర్భంగా ఆయనను పార్టీ వర్గాలు అభినందించాయి.

ముదిరాజ్‌లు కలిసికట్టుగా ఉండాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ముదిరాజ్ కులస్తులందరూ పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా ఉండాలని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు బండి రాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ముదిరాజ్‌లు సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో అందరి సహకారంతో ముదిరాజ్ కళ్యాణమండపం నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, రాజకీయ పార్టీల పేరుతో గ్రూపులుగా విడిపోవద్దని సూచించారు. అన్ని రాజకీయ పార్టీల సహకారంతో ముదిరాజ్ కళ్యాణమండపం నిర్మిస్తున్నట్టు వివరించారు. తమ ఐక్యతను ఎవరు దెబ్బతీసిన సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు సభ్యులు పాల్గొన్నారు.

ఎర్రపహాడ్‌లో పశుగ్రాస వారోత్సవాలు



టీకాలు వేస్తున్న అధికారి

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని ఎర్రపహడ్ గ్రామంలో పశుగ్రాస వారోత్సవాలను నిర్వహించారు. గుండె వాపు, జబ్బువాపు టీకాల కార్యక్రమంలో భాగంగా జిల్లా పశుసంవర్ధక అధికారి డా.సింహరావు మాట్లాడుతూ.. పశువుల పెంపకంలో పశుగ్రాసాల అవశ్యకత, పశుగ్రాసాల రకాలు, పశు సంవర్ధక శాక ద్వారా అందిస్తున్న గడ్డి విత్తనాల రకాల గురించి వివరించారు. పశువులకు గుండె వాపు, జబ్బ వాపు టీకాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కపిల్‌రెడ్డి, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి, డెయిరీ డీడీ ప్రవీణ్, డెయిరీ చైర్మన్ నరసింహరెడ్డి, మండల పశువైద్య అధికారి డా.రాంచందర్ పాడి రైతులు పాల్గొన్నారు.

అనాథకు లయన్స్ క్లబ్ చేయూత

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన బోయి గంగామణి అనే అనాథకు చేయూతనందించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కిషన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోయి గంగామణికి కూతురు మినహా చేరదీసేవారు లేకపోవడంతో గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నందున లయన్స్ క్లబ్ చేరదీసి 25కిలోల బియ్యం, నెలకు సరిపడే నిత్యావసర సరుకులు, ఆమెకు చీర, కూతురికి డ్రెస్సు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎం వేణుగోపాల్, డీసీపీ లక్ష్మీనారాయణ, సభ్యులు రాజుసేట్, శేఖర్‌సేట్, సంతోష్, గ్రామపెద్దలు వెంకట్రాంరెడ్డి, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన ముదిరాజ్‌లు



శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముదిరాజ్‌లు

నవతెలంగాణ-లింగంపేట్

శాసన మండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ బండ ప్రకాష్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్‌ను మండలంలోని లింగంపేట్, మెంగారం గ్రామాలకు చెందిన ముదిరాజ్ నాయకులు సోమవారం కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన మత్స్య సహకార సొసైటీల గురించి ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. త్వరలోనే జిల్లా అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కొత్తగా సొసైటీలు ఏర్పాటు చేయాలని మండల కమిటీ నుంచి వినతిపత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండలాధ్యక్షుడు సాయికుమార్, మెంగారం గ్రామ అధ్యక్షులు మార్గం సాయిలు, దాసరి పర్వయ్య, దాసరి గోపి, తంత్రి వెంకటి ఉన్నారు.

మొక్కులు తీర్చుకున్న ఎంపీపీ దంపతులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్ సోమవారం వేములవాడ రాజరాజశ్వర దేవాలయాన్ని తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని కోడె మొక్కులు తీర్చుకున్నారు.

గిరిజనుల్లో వెలుగులు నింపిన కేసీఆర్

- పోడు భూమి పట్టాల పంపిణీలో ఎమ్మెల్యే జాజాల సురేందర్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి/లింగంపేట్

గిరిజనుల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే జాజల సురేందర్ గిరిజన లబ్ధిదారులకు పోడు భూమి పట్టాలను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, తాడ్వాయి మండలాలకు చెందిన 668 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాలు రూ.70,08,120 విలువ గల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, అదేవిధంగా రూ.3,86,00 సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పిల్లలను ఉన్నతస్థాయి చదువులు చదివించాలని సూచించారు. పోడు భూముల ఎంపిక పూర్తి పారదర్శకంగా జరిగిందని, ఎవరైనా అటవీ భూములు చదును చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఎమ్మెల్యే జాజాల సురేందర్ మాట్లాడుతూ.. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలు దేశంలో ఎక్కడా లేవని పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు.



పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

పోడు భూముల పట్టాల పంపిణీ వల్ల గిరిజనుల చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాలుగు లక్షల ఎకరాలకు పోడు భూమి పట్టాల పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని అన్నారు. అదేవిధంగా కొన్ని పార్టీలు 4వేల రూపాయల పింఛన్ ఇస్తామని చెబుతున్నారని, మొదటగా వాళ్ల పాలిస్తున్న రాష్ట్రంలో రూ.4వేల పెన్షన్ ఇవ్వాలని ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పించారు. అభివృద్ధిలో మన రాష్ట్రం దూసుకుపోతుందని 9 సంవత్సరాల ముందు మన రాష్ట్రం ఎలా వుండే ఇప్పుడు తెలంగాణ వచ్చాక మన రాష్ట్రం ఎలా ఉందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఆర్డీఓ శ్రీను నాయక్, ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్, జడ్పీటీసీ ఉషగౌడ్, ఏఎంసీ చైర్మన్ కాశీ నారాయణ, బీఆర్ఎస్ నాయకులు జలందర్‌రెడ్డి, అదిములం సతీష్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బీమా చెక్కు అందజేత..

లింగంపేట్ : మండలంలోని భవానీపేట్ గ్రామానికి చెందిన బయికాడి భూమయ్య ప్రమాదవశాత్తు మృతి చెందారు. మృతుడు బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. సోమవారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు జజాల సురేందర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుని భార్య భూమవ్వకు రెండు లక్షల బిఆర్ఎస్ పార్టీ బీమా చెక్కును ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆయన చేతుల మీదుగా అందజేశారు.

లింగంపేట్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దివిటీ రమేష్ తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి పార్టీ అండగా నిలుస్తుంది అన్నారు. బీమా డబ్బులు కుటుంబానికి ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో భవానీపేట్ సర్పంచ్ ఆకుతోట నరసమ్మ ప్రకాష్, సర్పంచులు రవీందర్ నాయక్, కిషన్, మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్స్ నెరవేర్చాలి



పిట్లం : సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

- నిరవధిక సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-పిట్లం/రెంజల్

మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్స్ నెరవేర్చాలని రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం నుంచి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ చౌరస్తాలో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవో 8/2023 వెంటనే అమలు చేసి బకాయి వేతనాలను చెల్లించాలన్నారు. కేరళ ప్రభుత్వం రోజుకు రూ. 600లు చెల్లిస్తున్నట్లుగా తెలంగాణ ప్రభుత్వం చెల్లించాలన్నారు. 100 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో 25:1 పనిచేసే పద్ధతిలో నియమించి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. నిత్యావసర వస్తువులు, ఆహారాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వరాదన్నారు. 9, 10 తరగతి విద్యార్థులకు వండి వడ్డించినందుకు వంట కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. పెరుగుతున్న వస్తువుల ధరలకు అనుకూలంగా కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల మెస్ చార్జీలు చెల్లించాలన్నారు. పెండింగ్ వేతనాలు, బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

రెంజల్ : మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట ధర్నా చేపట్టారు. జులై 10,11,12 తేదీలలో జిల్లా స్థాయిలో వంటలను నిలిపివేస్తూ టోకెన్ సమ్మెకు దిగినట్లు మధ్యాహ్న భోజన ఏజెన్సీ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి పేర్కొన్నారు. జీవో నెంబర్ 8 ప్రకారం ఏరియాస్‌తో సహా బకాయిలన్నీ చెల్లించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, గుడ్డుకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని, అక్రమంగా తొలగింపులు నిలిపివేస్తూ రాజకీయ వేధింపులను నిలిపివేయాలని, కార్మికులందరికీ కాటన్ యూనిఫాం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుమేధ, శిరీష, రాజమణి, మెంగ సాయిలు, అశోక్, ప్రియా, మంగమ్మ, సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బడుల బంద్‌ను విజయవంతం చేయాలి

- విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-వర్ని/బోధన్

జూలై 12న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని యూఎస్ఎఫ్ఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శి సంజయ్ తలారే పిలుపునిచ్చారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యారంగంలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా ఇప్పటికే మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టినా ప్రభుత్వం దాన్ని ఎక్కడ కూడా సరిగా అమలు చేయడం లేదని అన్నారు. అధికారులు నిర్లక్ష్యం చాలా ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో సంక్షేమ హాస్టల్‌లో ఒక్క వార్డెన్ మూడు హాస్టల్‌లకు ఇంచార్జి చేయటం వలన విద్యార్థులకు నష్టాన్ని కలిగిస్తుందని ఆయన అన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్నటువంటి స్కాలర్‌షిప్, రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను రాష్ట్రవ్యాప్తంగా భర్తీ చేయాలని ఆయన కోరారు. ఈ బంద్‌కు విద్యార్థులు, ప్రైవేట్ యజమానులు, ప్రభుత్వ ఉద్యోగులు, మేధావులు అందరు కూడా సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేష్, బాలరాజ్, సాయిచరణ్, ఉదయ్ కిరణ్, అరుణ్,పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి..

బోధన్ : విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్టు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతమ్ కుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని టీఆర్టీ భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 12 న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బంద్‌లో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు దందా కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. మంత్రుల ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవరిస్తున్నట్లుగా ఉందని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా యూనిఫామ్ ఇవ్వలేదని, కొన్ని టైటిల్స్ పాఠ్యపుస్తకాలు పంపలేదని, చదువులు చెప్పే టీచర్లు లేరని, పారిశుద్ధ్య కార్మికులు లేరని అన్నారు. అనేక సమస్యలతో విద్యాసంవత్సరం ప్రారంభమైన నిర్దిష్టమైన చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదన్నారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, మూత్రశాలలు, సరైన మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం గోల్లుమంటుందన్నారు. మన ఊరు-మనబస్తీ-మనబడి నిధులు గుత్తేదారులు తూతూమంత్రంగా పనులు చేశారని కానీ అవి పాఠశాలలకు ఉపయోగ పడింది లేదని వాపోయారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారిందని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుంచి ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ రూ.5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. అందుకే ఈ సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను కదిలించి బంద్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్బీ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జిల్లా కార్యదర్శి మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు విగ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు అంజలి, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా నాయకులు మోసిన్, నాయకులు ఆకాష్, రాజన్న, సాయికుమార్, సంధ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : మాట్లాడుతున్న నాయకులు

యూనివర్సిటీలో వసతి గృహాల తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లోని బాలుర, బాలికల హాస్టల్ ను తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ యాదగిరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాస్టల్ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకొని అక్కడికక్కడే పరిష్కర మార్గాలను పరిష్కరించారు. రిజిస్ట్రార్ వెంట హాస్టల్ చీఫ్ వార్డెన్ డాక్టర్. మహేందర్, అసిస్టెంట్ ఇంజనీర్ వినోద్ కుమార్, ఎస్టేట్ ఆఫీసర్స్ అశోక్ వర్ధన్ రెడ్డి, యాదగిరి అసిస్టెంట్ వార్డెన్లు గంగా కిషన్, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ రాజేశ్వరి, కేర్ టెకర్స్ ఉన్నారు.

మానసిక వికలాంగ విద్యార్థుల మధ్య జన్మదిన వేడుకలు

- స్కూల్ బ్యాగులు పండ్లు స్వీట్ పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలకేంద్రంలోని శుభోదయం పాఠశాలలో చదువుతున్న మానసిక వికలాంగుల మధ్య మండలంలోని అర్గుల్ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ రాజేందర్ తన పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారని మండల కో ఆప్షన్ నెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ తెలిపారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. పండ్లు, స్వీటు పంపిణీ చేసి వారి సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విమల రాజు, గ్రామ ఉప సర్పంచ్ బాలకిషన్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కేశ్ పల్లి ఎంపీటీసీ గంగాధర్, కోఆప్షన్ సభ్యులు అక్బర్ ఖాన్, నందు యాదవ్, మేకల ముత్తెన్నా తదితరులు పాల్గొన్నారు

తొర్లికొండ పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు



గ్రంథాలయ వారోత్సవంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకొని సోమవారం సామూహిక గ్రంథాలయ పుస్తక పఠనోత్సవం నిర్వహించారు. ఈనెల 10 నుంచి 15 వరకు వారోత్సవాలు జరుగుతాయని ప్రధానోపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం అశోక్ తెలిపారు. విద్యార్థులు ధారాళంగా చదవడానికి వారోత్సవాలు దోహదపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వరూపారాణి, గౌతమి, వాణిశ్రీ, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఆదుకునేందుకే నీటి విడుదల

- ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి



నీటిని విడుదల చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

వర్షాలు కురియక నాట్లు వేయక ఇబ్బందులు పడుతున్న దృశ్య రైతులను ఆదుకునేందుకు ప్రాజెక్ట్ నుండి కుడి కాలువ ద్వారా సోమవారం సాగు కొరకు నీటిని విడుదల చేసినట్టు ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం మొదలై నెలరోజులు గడుస్తున్నా వర్షాలు కురియక రైతులు నాట్లు వేసే సమయం మించిపోతున్న తరుణంలో ప్రాజెక్టు కింది ఆయకట్టు రైతులు, రామడుగు గ్రామభివృద్ధి కమిటీ సభ్యులు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. అధికారులతో మాట్లాడి కుడి కాలువద్వారా నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. దీంతో 7,8గ్రామాల రైతులకు మేలు జరుగుతుందని. ఈ ఆయకట్టు కింది సుమారు 7 వేల ఎకరాలకు నీరు చేరుతుందని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్ రెడ్డి. మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, సొసైటీ వైస్ చేర్మెన్ నర్సారెడ్డి. ప్రాజెక్టు ఏఈ, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాజారెడ్డి, ఊపాధ్యక్షుడు జి రాజారెడ్డి, కుమ్మరి మురళి. కోతి భూమన్న. కూరం నర్సయ్య, నడిపి మల్లయ్య, కల్లెడ చిన్న గంగారాం, పసుల గంగాధర్, మురళి గౌడ్, అశోక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి వెల్లువెత్తిన ఫిర్యాదులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 215 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, మెప్మా పీ.డీ రాములు, డీపీఓ జయసుధ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్, అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్మీడియట్ కోర్సులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సిఈసీ, ఎంపిహెచ్‌డబ్ల్యూ కోర్సులు కేజీబీవీలో ఇంటర్మీడియట్ కోర్సులు ప్రారంభించడం జరిగిందని డిఇఓ ఎన్వి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని కేజీబీవీలలో ఈ విద్యాసంవత్సరం నుండి నవీపేట్, మోర్తాడ్‌లను అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియట్ కోర్సును 2023-24 విద్యాసంవత్సరం నుండి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కేజీబివి నవీపేట్, మోర్తాడ్‌లలో ఇంటర్మీడియట్ సిఈసీ, హెచ్‌డబ్ల్యూ కోర్సులలో ప్రతీ కోర్సుకు 40 సీట్లు కేటాయించారని, విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు సమర్పించాలని తెలిపారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



మానాల మోహన్‌రెడ్డికి సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా ఈరంటి లింగం నియమితులైన సందర్భంగా.. జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డిని నిజామాబాద్‌లోని ఆయన స్వగృహంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దొడ్ల రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు దోమతెరలు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ పార్టీ నాయకులు కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 10 సంవత్సరాలలోపు పిల్లలు ఉన్న కుటుంబలకు దోమతెరలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బోధన్ మండలంలోని ఖండ్‌గావ్, బిక్నెల్లి గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికి దోమతెరలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల టోకెన్ సమ్మె ప్రారంభం

- మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆర్మూర్



ఆర్మూర్‌లో..

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు 2022 మార్చ్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా వేతనాలు పెంచుతున్నట్లు ముఖ్య మంత్రి ప్రకటించినట్టు ఏరియర్స్‌తో సహా జీవో నెంబర్ 8 ప్రకారం చెల్లించాలని, కొత్త మెనూ సవరించాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లు తక్షణమే విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్రకు ఇవ్వడం విరమించుకోవాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 12వరకు మధ్యాహ్న భోజన కార్మికులు వంట బంధు పెట్టి టోకెన్ సమ్మె చేస్తున్నారని అందుకు సహకరించాలని తెలిపారు. గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, అవసరమైన గ్యాస్ సబ్సిడీకి ఇవ్వాలని, కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ప్రభుత్వమే ఇవ్వాలని, అక్రమ తొలగింపులు అరికట్టాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, షెడ్డు, వంట పాత్రలు తదితర మౌలిక వసతులు కల్పించాలని, యూనిఫామ్ ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు నుండి రుణాలు ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం ఆర్మూర్ మండల అధ్యక్ష కార్యదర్శులు జక్కం సుజాత, దయమని, అరుణ, సత్తెమ్మ ,నరసయ్య, బిల్ కీస్ బేగం , సెమినా బేగం, సుమలత, జయ, దేవా ఈ, భవిత, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



- స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

అభివృద్ధి పనులు వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో పర్యటించి, వివిధ అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన సమీకృత భవనం పనులను తనిఖీ చేశారు. నాణ్యత ప్రమాణాలతో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆగస్టు 11 వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మిగులు పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. అక్కడి నుంచి గిరిజన గురుకుల పాఠశాల ను సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా అంటూ విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. నసురుల్లాబాద్ గ్రామంలోని చేరువు కట్ట వద్ద ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలకు, నిరుపేదలకు ఇండ్ల స్థల కోసం భూమిని కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్,జడ్పి కో అప్షన్ మెంబర్ మజీద్, నాయకులు కంది మల్లేష్, లక్ష్మీనారాయణ గౌడ్, మైషగౌడ్, కలిల్, అధికారులు తదితరులు ఉన్నారు.

రేపటి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

రేపట్టి విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్యకార్యారణ నాయకులు కోరారు. పట్టణ కేంద్రంలో సీపీఐ(ఎం) కార్యాలయంలో వాపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పిడిఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎం.నరేందర్, ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఎస్.నాగరాజ్ , ప్రిన్స్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ ఫీజులు దందా కొనసాగుతున్న ఇప్పటికీ ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. మంత్రులు, ఉపసంఘం, తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనూకులంగా వ్యవరిస్తున్నట్లుగా ఉందని అన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా యూనిఫామ్ ఇవ్వలేదని, కొన్ని టైటిల్స్ పాఠ్యపుస్తకాలు పంపలేదని, టీచర్లు, పారిశుధ్య కార్మికులు లేరని, అనేక సమస్యలతో విద్యాసంవత్సరం ప్రారంభమైన ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్, సరైన మౌళిక సదుపాయాలు లేవని అన్నారు. మన ఊరు-మనబస్తీ-మనబడి పనులు తూతూమంత్రంగా మాత్రమే జరిగాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా అందివ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో నాలుగేళ్ల నుండి ఫీజు రీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ 5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, గురుకులాలు, కెజిబివిలు, ఇంటర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేసిన కెజిబివిలు భవనాలు లేక అరకొర సౌకర్యాలతో అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు. వాటికి నిధులు లేవని, లెక్చరర్స్, టీచర్స్ లేరని,టీచర్,లెక్చరర్స్ ఖాళీలు ఉన్నాయని, ఇప్పటికీ ఒక్క డిఎస్సీ వేయలేదని అన్నారు. సమస్యలను పరిష్కారం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పీడీఎస్‌యూ ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ అనిల్, డి. నిఖిల్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు జవహర్, పిడిఎస్‌యూ నాయకులు మహేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : ఈనెల 12న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బందును విజయవంతం చేయాలని ప్రగతి శీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు అనిల్ కుమార్, నిఖిల్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు అధికమయ్యాయని తెలిపారు. విద్యార్థులకు మౌలిక సతులు కల్పించాలని, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలపై ప్రత్యేక దష్టి పెట్టాలని, విద్యారంగ బలోపేతానికి కషి చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టాలని, విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థులు, మేధావులు, తల్లిదండ్రులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయి, మహేష్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ



మల్కాపూర్‌తాండలో పింఛన్ల పంపిణీ చేస్తున్న ఎంపీపీ అనూష ప్రేమ నాయక్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

మండలంలోని మల్కాపూర్ తండాలో మూడు కొత్త పింఛన్లు సోమవారం పంపిణీ చేశారు. ఎంపీపీ అనూష ప్రేమ నాయక్, సర్పంచ్ ఆధ్వర్యంలో లబ్దిదారులకు ప్రొసీడింగ్ కాపీనిచ్చి డబ్బులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ఎస్టీసేల్ అధ్యక్షులు బానోత్ గోపాల్ నాయక్, మండల ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఉప సర్పంచ్ మోతి, సెక్రెటరీ సంతోష్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆనంద్, హెడ్మాస్టర్ మధు, నాయకులు పాల్గొన్నారు.

షాదీఖానా పనులు ప్రారంభం

నవతెలంగాణ-మాక్లూర్



షదీఖానా పనులు ప్రారంభిస్తున్న ముస్లింలు

మండల కేంద్రం లో షాదీఖా నా పనులను స్థానిక ముస్లిం లు సోమవా రం ప్రారంబించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ.. ఆ ర్మూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ సహకారంతో రూ. 25 లక్షలు మంజూరు అయ్యాయని, వాటితో పనులు ప్రారంభించామన్నారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దలు, ముస్లిం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

రోడ్డును బాగు చేయించండి

- వీధిలైట్లు వెలిగేటట్టు చూడండి
- సర్పంచ్‌కు, గ్రామ కార్యదర్శికి వినతి అందజేత

నవతెలంగాణ-మద్నూర్



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



గుంతల రోడ్డులో పడ్డ వాహనదారుడు

మద్నూర్ మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గతంలో మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి ఉండగా 161వ జాతీయ రహదారిని గుర్తిస్తూ దానిని నాలుగు లైన్ల రహదారిగా నిర్మాణం చేపట్టగా ఈ రహదారి మండల కేంద్రానికి బైపాస్ గుండా వెళ్లిందని, మండల కేంద్రానికి గల రహదారి ఇరువైపులా చెడిపోయి భారీ గుంతలు పడ్డాయని కావున గ్రామపంచాయతీ సర్పంచ్, పాలకవర్గం అధికారులు వెంటనే రోడ్డు బాగు చేయించాలని గ్రామ యువకులు కోరారు. అలాగే రహదారి గుండా గల వీధిలైట్లు వెలిగేటట్లు చూడాలని తెలిపారు. ఈ విషయమై సోమవారం సర్పంచ్ సురేష్‌కు, గ్రామ కార్యదర్శి సందీప్‌కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సాయిలు, బాలాజీ, సాయి, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆరోగ్య బోధకుడు దస్తీరాం

నవతెలంగాణ-జుక్కల్



సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు చేబుతున్న దస్తీరం

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య బోధకుడు దస్తీరాం అన్నారు. సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ అశ్విని ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దస్తీరాం మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు నివారణ చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. కీటక జనిత వ్యాధులు మలేరియా, పైలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, కలరా, నివారణకు ప్రస్తుతం వర్షకాలం కావడంతో కొత్త, పాత నీరు కలవడం నీటి కాలుష్యం వలన జాండీస్, డయేరియా రాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎల్పీ నేతను కలిసిన మదన్ మోహన్

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



సీఎల్పీ నాయకులను కలిసిన మదన్ మోహన్

కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ నాయకులు బట్టి విక్రమార్కను హైదరాబాద్ నివాసంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్ మోహన్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ.. భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 1360 కిలోమీటర్లు విజయ వంతంగా పూర్తిచేసుకున్న సందర్భంగా వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అనంతరం వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అవలంభించబోయే సాంకేతిక పరమైన అంశాలపై సురదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు.

పూర్ణ, ఆనంద్‌లను ఆదర్శంగా తీసుకోవాలి

- ఎంపీపీ నారెడ్డి దశరథ్‌రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

గురుకుల పాఠశాలలో చదివి ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన మాలావత్ పూర్ణ, ఆనంద్‌ను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత స్థానాలలో స్థిరపడాలని స్థానిక ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఉప్పల్వాయి షెడ్యూల్ కులాల వసతి గృహంలో విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్కులు, ఏకరూప దుస్తులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా దశరథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులు వారు పాలించే రాష్ట్రాలను పరిశీలన చేసి మాట్లాడాలని, చేతగాని దద్దమ్మల్ల, ఏది పడితే అది మాట్లాడడం మంచిది కాదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జాజాల సురేందర్ సహకారంతో వసతి గృహంలో 150 మంది విద్యార్థులు ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు మండలాధ్యక్షులు నారాయణరెడ్డి, సర్పంచ్ కొత్తొల్ల గంగారం, ఎంపిటిసి ఉమాదేవి దత్తాద్రి, ఉపసర్పంచ్ సరస్వతి, బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు రంగు రవీందర్‌గౌడ్, వార్డెన్ మమత, నర్సింలు, రాజయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NIZAMABAD

S.O.P. No. 14 /2023

Between:-
Rudra Prabhakar S/o R.Gangaram, Age: 58 years, Occ: Pvt Employee, R/o Donkal Village of Morthad, Mandal, Nizamabad. Presently Residing I at New NGO S Colony, Subhash nager, Nizamabad

... Petitioners

And

1. The Assistant Provident Fund Commissioner (Pensions), Sub-Regional Office, Nizamabad. Nylkal Road, Nizamabad. Town
2. To whom so ever it may concern.

...Respondents.

'To
To whom so ever it may concern. (Respondent No.2)

Whereas the above-named petitioners have filed the above case for grant of succession certificate on account of death of Smt. Rudra Sayamma W/o. Rudra Gangaram R/o. Donkal village of Nizamabad. Dist.

If any person is having any objection regarding issue of succession certificate in favour of the petitioner may appear before the above Court on 02-08-2023 at 10.30 A.M. otherwise matter will be decided on the material available.

//By order of the Court//

G .V. KRUPAKAR REDDY
C.SAIREDDY
Advocates,
"SRINILAYAM"
#5-9-64, Road No.1
Yellammagutta,
NIZAMABAD.
Phone: 9849333644

గిరిజన మహిళ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నాగారంలోగల తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి గాను ఈ నెల 10 నుండి 20వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సైదా జైనాబ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఎస్సి (బి జెడ్ సి(70757523413O), ఎంజెడ్‌సి(9553964680), ఎంపీసీఎస్(7729095829), ఎంఎస్‌సిఎస్(7095898603), బిబిఏ (9490289443), గ్రూపులలో సీట్లు ఉన్నట్టు పేర్కొన్నారు.

కష్టపడి పనిచేస్తేనే ప్రాధాన్యత

- కాంగ్రెస్‌లో రావడానికి ద్వారాలు తెరిచే ఉన్నాయి
- ఎవ్వరికీ టికెట్ల హామీ లేదు, సర్వేలే ప్రామాణికం
- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

కష్టపడి పనిచేస్తేనే ప్రాధాన్యత ఉంటుందని, కాంగ్రెస్‌లోకి రావడానికి ద్వారాలు తెరిచి ఉన్నాయని, చేరేవారికి ఎవరికి టికెట్ల హామీ లేదని, సర్వేలే ప్రామాణికమని టిపిసిసి కార్యనిర్వాక అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం నిజామాబాద్ నగరంలోని జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన నూతనంగా నియమింపబడిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ముఖ్యఅతిథిగా మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. టీపీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్బిన్ హందాన్ గారు, పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్ , నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ భూపతి రెడ్డి , బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ కాసుల బాల్ రాజు పాల్గొన్నారు. నూతనంగా మండల బ్లాక్ స్థాయి అధ్యక్షులకు నియామక పత్రాలు అందించిన అనంతరం మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మండల స్థాయి మరియు బ్లాక్ స్థాయి నాయకులు మరియు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వెన్నుముకలాంటివారని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నాయని, రానున్న మూడు నెలల సమయం కాంగ్రెస్ పార్టీకి చాలా క్రియాశీలక సమయమని, ఈ సమయంలోనే కార్యకర్త నుండి జిల్లా స్థాయి నాయకుని వరకు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నిబద్ధతతో కష్టపడి పనిచేయాలని, కష్టపడి పనిచేసిన వారికి భవిష్యత్తులో పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని ఆయన అన్నారు. రాష్ట్రంలోని బిఆర్ఎస్ అటు కేంద్రంలోని బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అనునిత్యం ప్రజల్లోనికి తీసుకువెళ్లి గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే చేపట్టబోయే అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి చెబుతూ కాంగ్రెస్ పార్టీ గెలుపు యొక్క ఆవశ్యకతను ప్రజలకు తెలియజేసే విధంగా కార్యచరణ రూపొందించాలని ఆయన నాయకులను కోరారు. మండల బ్లాక్, జిల్లాస్థాయి నాయకులు కష్టపడి క్రమశిక్షణతో పని చేయాలని, వారి పనితీరును రాష్ట్రస్థాయిలో పిసిసి పర్యవేక్షిస్తుందని, పనితీరు సరిగా లేని వారిపై వేటు తప్పదని ఆయన తెలిపారు. అభ్యర్థుల టికెట్ల విషయం పూర్తిగా అధిష్టాన నిర్ణయమని, దానికి అందరూ కట్టుబడాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు కిసాన్ కేత్ కాంగ్రెస్ ముప గంగారెడ్డి,మాజీ బీసీ సెల్ చైర్మన్ శేఖర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ విక్కీ యాదవ్, ఎన్.ఎస్.యు.ఐ వేణు రాజ్,మహిళా కాంగ్రెస్ భాగ్య , మైనారిటీ సెల్ ఇర్ఫాన్ అలీ, ఓబీసీ సెల్ నరేందర్ గౌడ్, ఎస్సీ సెల్ లింగం, సేవాదళ్ సంతోష్,వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,అబ్దుల్ ఏజజ్,ఈసా, ప్రీతాం,నాగరాజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

నిలిచిన ఎక్సైజ్ భవన నిర్మాణ పనులు



పూర్తికాని భవన నిర్మాణ పనులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వానికి దండిగా ఆదాయం తెచ్చిపెడుతున్న ఎక్సైజ్ శాఖకు సొంత భవనాల నిర్మాణం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సొంత భవనాల నిర్మాణ పనులను ఐదు సంవత్సరాల కింద ప్రారంభించింది. భవనాల నిర్మాణం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి సొంత భవనాల నిర్మాణ పనులను ఐదు సంవత్సరాల క్రితం ఆరంభించిన ఇప్పటివరకు పూర్తి కాలేదు. దీంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గమైన జిల్లాలోని నిజామాబాద్, బోధన్, భీమగల్, మోర్తాడ్, ఆర్మూర్లలో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలు ఉన్నాయి. అంతట సొంత భవనాలు లేకపోవడంతో అద్దె ఇల్లు ప్రభుత్వ ఆధీనంలోని ఇతర శాఖల భవనాల్లో ఎక్సైజ్ కార్యాలయాల్లోనూ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వానికి ఆదాయ మార్గాలను చూపుతున్న ఎక్సైజ్ శాఖను ఆదరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2018లో సొంత భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించారు. అప్పట్లో అంచనా వ్యయం తక్కువగా ఉండడంతో ఒక్కో భవన నిర్మాణం కోసం 40 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేశారు. అయితే సకాలంలో పనులు ప్రారంభించకపోవడం బిల్లుల చెల్లింపులో జాప్యం ఇతరత్రా కారణాలతో అంచనా వ్యయం భారీగా పెరిగిపోయింది. గతంలో నిధులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. అయితే బిల్డింగ్‌కు సంబంధించి తలుపులు, కిటికీలు కలర్స్ వేయడం ఇతర సౌకర్యాలను కల్పించడానికి నిధుల కొరత తీవ్రమైంది. ఒక్కో భవనానికి 10 లక్షల నిధులను విడుదల చేస్తేనే నిర్మాణం పూర్తి చేసుకున్న ఎక్సైజ్ భవనాలు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉంది అదనపు నిధులను మంజూరు చేయడంపై ప్రభుత్వం దృష్టి సరించకపోవడంతో భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎక్సైజ్ శాఖకు అదనంగా నిధులను మంజూరు చేసి భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

కేజ్‌వీల్ ట్రాక్టర్లతో రోడ్లపై తిరుగవద్దు : ఎస్ఐ

నవతెలంగాణ-మోపాల్

కేజ్‌వీల్ ట్రాక్టర్లుతో వెళ్లి రోడ్లు పాడుచేయొద్దని, అలా చేయడం వల్ల గుంతలుగా ఏర్పడి వాహనాలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ మహేష్ తెలిపారు. ఎవరైనా పట్టిలు లేకుండా కేజ్ వీల్ ట్రాక్టర్లు రోడ్ల పైన కనిపిస్తే చట్టరీలు తీసుకుంటామని, పెద్ద మొత్తంలో ఫైన్ విధించడం జరుగుతుందని అన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయొద్దని, లైసెన్సు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్నారని, వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సీట్ బెల్ట్ కూడా ధరించాలని తెలిపారు. ప్రతిరోజు తనిఖీ నిర్వహించటం జరుగుతుందని ఆయన అన్నారు.

29న విశ్వకీర్తి అవార్డుల ప్రధానోత్సవం

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వ స్ఫూర్తి , విశ్వ కీర్తి అవార్డుల ప్రధానో త్సవం ఈనెల 29న శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణచార్య సోమవారం తెలిపారు. తెలంగాణ జాతిపిత అయిన ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య పేరిట విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా ఆధ్వర్యంలో, జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఇంటర్ పాలిటెక్నిక్ ఐటిఐ పూర్తి చేసి పాసైన వారు ఐఐటి నీట్ ఎంసెట్ లలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన వారికి డిగ్రీ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తిచేసిన విశ్వబ్రాహ్మణ విద్యార్థిని విద్యార్థులకు విశ్వస్ఫూర్తి ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన విశ్వబ్రాహ్మణ ఉద్యోగులకు సర్వీస్ లో ప్రమోషన్లు పొందిన వారికి సర్వీసులో ఉత్తమ పురస్కారాలు పొందిన వారికి ఈ ఏడు ఉద్యోగ విరమణ పొందుతున్న విశ్వబ్రాహ్మణ ఉద్యోగస్తులందరికీ ఈఅవార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.



గోపాల కృష్ణచార్య

ఆయా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శిస్తున్న విశ్వబ్రాహ్మణ కళాకారులకు, రచయితలకు, పాత్రికేయ మిత్రులకు, రాజకీయ నాయకులకు, విశ్వకీర్తి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేస్తూ సత్కారం చేస్తామని వేవా జిల్లా అధ్యక్షులు రాఘవా పురం గోపాలకృష్ణాచార్య తెలిపారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని వారు 9391044536, 9704496588, నెంబర్లకు నిజామాబాద్ డివిజన్ పరిధిలోని వారు 9492481288, 9550469917 నెంబర్లకు, బోధన్ డివిజన్ పరిధిలోనివారు 9963290646, 94 94961238 ననెబర్లకు బయోడేటాతో పాటు, ఆధార్ కార్డు ఫొటో ఉత్తీర్ణత పొందిన ధ్రువపత్రాలు ఉద్యోగం, ప్రమోషన్ పొందిన ధ్రువపత్రాల ఫొటోలను పంపాలని తెలిపారు.

నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్లుగా సొప్పరి సుధీర్, రహమత్ అలీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజాంబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్గా సూపర్ సుధీర్ రహమత్ అలీ నియమించినట్లు మండల యూత్ ప్రెసిడెంట్ వినోద్ సోమవారం తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోపి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు విక్కీ యాదవ్ నియామక పత్రాలను అందజేశారు.





నియామకపత్రాలు అందుకుంటున్న కాంగ్రెస్ యూత్ వైస్ ప్రెసిడెంట్లు

13వ రోజుకు రైతుల సమ్మె



సమ్మెలో కూర్చున్న రైతులు

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం 13వ రోజుకు చేరుకుంది. బందల రోడ్డు, మాచాపురం రోడ్డు, గంగమ్మ తల్లి రోడ్డు, దూపల్లి ఎక్స్‌రోడ్డు వరకు మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని లేనియెడల రోడ్డు పనులు ప్రారంభించేంతవరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు దేశ్‌పేట్ పోశెట్టి, చుక్క రాజుగౌడ్, ఆజన్న, కొండలవాడి శ్రీనివాస్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించిన మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు

- ప్రాజెక్టు గురించి వివరించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రజల మహాశక్తి కాళేశ్వరం ప్రాజెక్టు అని మహారాష్ట్రకు చెందిన బీఆర్ఎస్ ప్రముఖ నాయకులు, మాజీ ఎమ్మెల్యేలు అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్ర పర్యటనకు వచ్చిన మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు అన్నసాహెబ్‌మనే, కదీర్ మౌలానా, ఘనష్యం, శ్రీరామ్పూర్, మాజీ ఎమ్మెల్యే భానుదాస్ ముర్కుటే, ప్రహ్లాద్ రాథోడ్, శరద్ పవర్, బాల సాహెబ్, అరుణ్ కొడు, ఏకనాథ్ గోగాడేలు రెండు రోజుల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు గాయత్రీ పంపు హౌస్‌ను సోమవారం మహారాష్ట్ర బృందం సందర్శించింది. పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డి స్వయంగా మహారాష్ట్ర నేతలకు కాళేశ్వరం ప్రాజెక్టును చూపించారు. ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు విశేషాలను వారికి వివరించారు మొత్తం 3 బ్యారేజీలు, 1531 కి.మీ. గ్రావిటీ కెనాల్స్, 203 కి.మీ. టన్నెల్స్, 20 లిఫ్టులు, 19 పంపు హౌస్‌లు, 20 రిజర్వాయర్లలతో మొత్తం 37 లక్షల ఎకరాలకు 147 టీఎంసీల సాగునీటిని అందించే కాలేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ విశేషాలు తెలుసుకొని మహారాష్ట్ర నేతలు ఆశ్చర్య చకితులయ్యారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని, ఇప్పటి వరకు ప్రపంచంలో అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులుగా యూస్‌లోని కొలొరాడో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తో పాటు ఈజిప్ట్‌లోని అతిపెద్ద మానవ నిర్మిత నది మాత్రమే ఉన్నాయని, ఇప్పుడు వాటిని కాళేశ్వరం ప్రాజెక్టు అధిగమించిందని ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చెప్పినప్పుడు మహారాష్ట్ర నేతలు హర్షం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర నేతలతో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణకు కేసీఆర్ ఇచ్చిన అపురూప గిఫ్ట్ కాళేశ్వరం వరల్డ్ లార్జెస్ట్ లిఫ్ట్ అని, ఈ ప్రాజెక్టు ద్వారా కోటి ఎకరాలకు సాగునీటిని సరఫరా చేయాలన్న కల సాకారమైందని తెలిపారు.



కాళేశ్వరం ప్రాజెక్టువద్ద మహారాష్ట్ర నాయకులు

సీఎం రిలీఫ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-వర్ని

మండలంలోని జాకోర గ్రామంలో తోకల నవనీతకు రూ.20,000 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును సర్పంచ్ గోదావరి గణేష్ అందజేశారు. మంజూరు చేయించిన స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పేదల ఆరోగ్యానికి అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిరి, ఎంపీటీసీ వై.సాయిలు, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బి.సాయిలు, రైతు సమన్వయ అధ్యక్షుడు బాక్సర్ బాలయ్య, బీఆర్ఎస్ నాయకులు టి.దత్తు, బి.శంకర్, ఎర్సపల్లి దస్తిరామ్, రమేష్‌గౌడ్, రామల కమిటీ చైర్మన్ కెంపుల సాయిలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.